సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



విద్యుత్ అవసరాలకు రూ.170 కోట్ల ఖర్చు

ఒంగోలు నియోజకవర్గంలో విద్యుత్ అవసరాలకు రూ.170 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే బాలినేని తెలిపారు. - 8లో..



సమన్వయం డొల్లే !

టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఒంగోలులో జరిగిన సమన్వయ సమావేశంలో సమన్వయం లోపించినట్లు తెలుస్తోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
33.9/17.36

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

పెండింగ్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనిలో ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ 30 రోజులు దాటిన క్లెయిమ్‌లన్నీ ఈనెల 23వ తేదీ నాటికి తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. దీనిలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీలత, ఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక స్కూల్, విశ్రాంత సైనికుల వైద్యశాల ఏర్పాటు చేయాలి

- కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీని కోరిన ఎంపీ మాగుంట



కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీని కలిసిన ఎంపీ మాగుంట

ఒంగోలు సెంట్రల్: ఒంగోలులో సైనిక స్కూల్, విశ్రాంత సైనికుల (ఈసీహెచ్ఎస్) వైద్యశాలను ఏర్పాటు చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీ గిరధర్ అరమనేనిని కలసి విజ్ఞప్తి చేసినట్లు మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి తెలిపారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరులో, దాని పరిసర ప్రాంతాల్లో రక్షణ శాఖలో 20 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, రిటైర్డ్ ఉద్యోగులు మరో 13 వేల మంది వారి కుటుంబ సభ్యులు ఉన్నారని చెప్పారు. వారి సేవల నిమిత్తం గిద్దలూరులో ఉన్న చిన్న వైద్యశాల వారి వైద్య అవసరాలు తీర్చలేకపోతోందని చెప్పారు. ప్రభుత్వ జాబితాలో చేర్చిన అన్ని సదుపాయాలతో ఈహెచ్ఎస్ వైద్యశాలను ఒంగోలులో ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీ గిరధర్ అరమనే వైద్యశాల ఏర్పాటు చేస్తామని, సైనిక స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి తెలిపారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపునకు కృషి

- డీఈవో వీఎస్ సుబ్బారావు



ట్యాబ్‌లు అందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపునకు ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని డీఈవో, సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు అన్నారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశపు మందిరంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ దివ్యాంగులు సాధారణ విద్యార్థులతో సమానమని వారి అభ్యసన స్థాయిల పెంపుదలకు ట్యాబ్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. ల్యాబ్స్ సక్రమంగా ఉపయోగించుకునేలా తల్లిదండ్రుల కృషి కూడా ఉండాలని చెప్పారు. జిల్లాలోని వివిధ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న రిసోర్స్ కూడా ట్యాబ్స్ అందిస్తామన్నారు. ఈ ట్యాబ్స్‌లో దివ్యాంగ విద్యార్థుల దృష్టి, శ్రవణ లోపం ఉన్న వారి కోసం ప్రత్యేకమైన యాప్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. స్పెషల్ టీచర్లు ట్యాబ్ అందుకున్న విద్యార్థుల ప్రగతిని గమనించాలని ఆదేశించారు. వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎం.రమేష్, ప్రభుత్వ బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, స్పెషల్ టీచర్లు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



కొండపి టీడీపీలో వర్గపోరు భగ్గుమంటోంది. ఎమ్మెల్యే డోల శ్రీబాల వీరాంజనేయస్వామి ఒంటెత్తు పోకడలపై పార్టీ కేడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'భవిష్యత్‌కు బాబు గ్యారంటీ' కార్యక్రమం వేదికగా రచ్చ రాజుకుంది. ఫ్లెక్సీల ఏర్పాటు సందర్భంగా తలెత్తిన వివాదం ముదిరి కార్యక్రమం ఆగిపోయే వరకూ వెళ్లింది. నియోజకవర్గంలో అంతా తానై వ్యవహరిస్తూ పార్టీ కేడర్‌ను గాలికొదిలేశారని ఎమ్మెల్యే స్వామిపై కారాలు మిరియాలు నూరుతున్నారు. నియోజకవర్గం మొత్తం గ్రూపులుగా విడిపోవడంతో ఎమ్మెల్యే 'భవిష్యత్‌కు గ్యారెంటీ' లేదు అని ఆ పార్టీ నేతలు బహిరంగంగా మాట్లాడడం గమనార్హం.

డోలా భవిష్యత్‌కు.. గ్యారెంటీ ఏదీ..!

- కొండపి టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు
- తారస్థాయికి చేరుకున్న నేతలమధ్య పోరు
- ఎమ్మెల్యే స్వామి తీరుపై ఆగ్రహం
- కట్టావారిపాలెంలో ఆగిన 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ' కార్యక్రమం

ఒంగోలు, సాక్షి ప్రతినిధి: కొండపి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ' కార్యక్రమం సాక్షిగా ఎమ్మెల్యే డోల శ్రీబాలవీరాంజనేయస్వామికి పార్టీ కేడర్ ఝలక్ ఇచ్చారు. కొండపి మండలం కట్టావారిపాలెంలో ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఒక వైపు ఏర్పాట్లు జరుగుతుండగానే మరో వైపు రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం రచ్చకెక్కింది. చివరకు కార్యక్రమం ఆగిపోయిన దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే ఒక వర్గానికి కొమ్ము కాయడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని పార్టీ నాయకులు అంటున్నారు. వాస్తవానికి ఈ 14, 15 తేదీల్లో 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ ' కార్యక్రమం కట్టావారిపాలెంలో నిర్వహిస్తున్నట్టు నేతలు ప్రకటించారు. స్వామి వర్గానికి చెందిన అనుమాల ప్రసాద్ కార్యక్రమ ఏర్పాట్ల బాధ్యతలు తీసుకున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు హైదరాబాద్‌లో ఉండే ఇతను గ్రామానికి వచ్చి మరీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. ఇక్కడే నిప్పు రాజుకుంది. ఆ ప్రాంతంలో పార్టీకి కీలకంగా వ్యవహరిస్తున్న నాయకులకు కనీసం మాటవరసకైనా చెప్పకుండా ఏర్పాట్లు చేశారు. ఉన్నట్టుండి ఊరిలో 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ' కార్యక్రమ ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిని చూసి ఎప్పటి నుంచో పార్టీనే నమ్ముకుని ఉన్న కల్లూరి నరేంద్ర వర్గం విస్తుపోయింది. ''ఎప్పటి నుంచో పార్టీకి విధేయులుగా ఉంటూ ఆర్థికంగా సహకరిస్తున్న మాకు ఒక్క మాట కూడా చెప్పకుండా కార్యక్రమం ఏర్పాటు చేయమేంటి'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ విషయాన్ని టీడీపీ నాయకుడు దామచర్ల సత్య దృష్టికి తీసుకెళ్లారు. అందరూ కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలు చేయాల్సి ఉండగా అనుమోలు ప్రసాద్ వేసిన ఫ్లెక్సీల్లో స్వామి అనుకూలవర్గానికి చెందిన వారి ఫొటోలు వేసి నియోజకవర్గంలోని మరో ముఖ్య నాయకుడు దామచర్ల సత్య వర్గానికి చెందిన వారి పేర్లు వేయకపోవడం సరికాదని మండిపడుతున్నారు. ఇదే విషయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు బొడపాటి యలమందనాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన సమస్యను ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య దృష్టికి తీసుకుని వెళ్లి రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. అది సాధ్యం కాకపోవటంతో 'భవిష్యత్‌కు బాబు గ్యారంటీ' కార్యక్రమం కట్టావారిపాలెం ప్రజలకు గ్యారంటీ ఇవ్వకుండానే అర్థంతరంగా ఆగిపోయింది. పార్టీలో కష్టపడుతున్న తమకు ముందు గ్యారంటీ ఇచ్చి తరువాత ప్రజలకు గ్యారంటీ ఇవ్వాలని ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్యను టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనుమోలు ప్రసాద్ పార్టీలో చేరి ఎమ్మెల్యే స్వామి అండదండలతో కాంట్రాక్టులు పొంది లాభాలు గడించాడని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నాడని ఆ పార్టీ నాయకులు రగిలిపోతున్నారు. ఇలాంటి వ్యక్తికి ఎమ్మెల్యే కొమ్ముకాయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక్క కట్టావారిపాలెం గ్రామానికే పరిమితం కాలేదు.. నియోజకవర్గంలోని టీడీపీ కేడర్ ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అవసరం వచ్చినప్పుడు తమను వాడుకుంటూ ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడం ఎమ్మెల్యేకు పరిపాటిగా మారిందని పార్టీ నాయకులు బహిరంగంగా ఆరోపించడం గమనార్హం. ఇలా అయితే వచ్చే ఎన్నికల్లో తామేంటో చూపిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే స్వామి భవిష్యత్‌కు బీటలు పడ్డాయని పార్టీ నేతలే అంటున్నారు.



కొండపి మండలం కట్టావారిపాలెంలో అనుమోలు ప్రసాద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత

- మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సభలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



యర్రగొండపాలెం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డి, కార్యవర్గం

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చి సామాజిక న్యాయం పాటిస్తూ పదవుల ద్వారా వారికి తగిన ప్రాధాన్యత ఇస్తారని, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకంలో యర్రగొండపాలెం మార్కెట్ కమిటీ చైర్మన్ సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డి, సభ్యులు ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలో కష్టపడేవారికి ప్రాధాన్యత ఇస్తారని, పార్టీ కోసం పనిచేస్తున్న సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డిని మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమించామని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇప్పటి వరకు మార్కెట్ యార్డు ద్వారా మూడు పర్యాయాలు వైఎస్సార్ సీపీకి చెందిన వారే సేవలందించారని అన్నారు. రైతులకు అవసరమైన సేవలను మార్కెట్ యార్డు ద్వారా అందించేందుకు నూతన పాలక మండలి ద్వారా కృషి చేస్తామని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలే ఆలోచించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి రాజకీయంగా ఎదిగేందుకు సామాజిక న్యాయం పాటించారని అన్నారు. యర్రగొండపాలెంలో రైతు బజార్ నిర్మించుకున్నామని, త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. అదే విధంగా మార్కెట్ యార్డు కార్యాలయం, గోడౌన్ నిర్మాణ పనులు, ఓపెన్ ప్లాట్ ఫాం నిర్మాణాలు చేపడతారని వివరించారు. రైతులు, కౌలు రైతులు, గిరిజన రైతులు, దేవాలయ భూముల రైతులంతా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ యార్డు దోహదం చేస్తుందని అన్నారు. రైతుల పక్షపాతిగా పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసుకోవడం ద్వారా జిల్లాలో వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అదే విధంగా మాచర్ల వద్ద శంకుస్థాపన చేసిన వరికపుడిశల ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గ ప్రజలకు నీటి కష్టాలు తీరనున్నాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు ప్రజలను విస్మరించాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటల ముఖ్యమంత్రి కాదని, చేతల్లో ఆచరించి చూపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆర్ సుశీల వెంకట పిచ్చయ్య, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు రిబకమ్మ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మూర్తిరెడ్డి, గ్రామసచివాలయ కన్వీనర్ సీహెచ్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు మజీద్ నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. సభకు ముందు పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, పార్టీ దివంగత నాయకుడు పెద్దపోతు చంద్రమౌళిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రగొండపాలెం మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డిచే మార్కెట్‌యార్డు సెక్రటరీ కపిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్‌చైర్మన్‌గా కొర్రపోలు జయరావు, డైరెక్టర్‌లుగా హసావత్ హనిమిభాయి, కె మరియమ్మ, కుమారి, సుశ్మిత, గంగమ్మ, కాశమ్మ, అంబమ్మ, నారాయణమ్మ, గంగరాజు, రమణారెడ్డి, అల్లు రామ్‌భూపాల్‌రెడ్డి, దోగిపర్తి సంతోష్ కుమార్, డి చిన్నమౌలాలిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను ఘనంగా గజమాలలతో సన్మానించారు.

బీసీలకు అండగా వైఎస్సార్ సీపీ



బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- బ్యాక్ బోన్ క్లాస్ చూసుకుంటున్న సీఎం వైఎస్ జగన్
- బీసీ వర్గాలు తనను ఎంతో ఆదరిస్తున్నారు
- బీసీల ఆత్మీయ సదస్సులో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్: బీసీలంటే బ్యాక్ వార్డు క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని ఆదరించి బీసీలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక ఒంగోలు నగరంలోని బాలినేని నివాసంలోని సమావేశ మందిరంలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అటు రాజకీయంగా, సామాజికంగా సీఎం వైఎస్ జగన్ బలాన్ని చేకూర్చారని అన్నారు. బీసీలకు చెందిన అన్ని కులాలు పార్టీకి పూర్తి స్థాయి మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. బీసీ సంఘాలు, కులాలు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని కొనియాడారు. ఈ నెల 21వ తేదీన ఒంగోలు సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఈ బస్సు యాత్ర రాష్ట్రంలోనే గొప్ప పేరు తెచ్చుకునేలా విజయవంతం చేయాలని బీసీ సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. అన్ని కుల సంఘాలు, చేతి వృత్తుల వారు ప్రత్యేకంగా శకటాలను రూపొందిస్తున్నారని వెల్లడించారు. ఎంతో ఆకర్షణీయంగా ఈ శకటాల రూపకల్పన జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనను అన్ని బీసీ కులాల నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఆదరించారని, ఇకపై కూడా మీ ఆదరాభిమానాలు ఉండాలని ఆకాంక్షించారు. ఒంగోలు నగరంలో అన్ని కులాలకు ఆరామ క్షేత్రాలకు స్థలాలు కేటాయించానని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వాళ్లకు కూడా కేటాయిస్తానని బాలినేని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, నగర పార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్, ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు చేతాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలితతో పాటు కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాలను నిర్లక్ష్యం చేస్తే మానవాళికి ప్రమాదకరం



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

- పర్యావరణాన్ని కాపాడుకుంటూ తిరిగి వినియోగించుకునే అంశంపై దృష్టిసారించాలి
- అంతర్జాతీయ సదస్సులో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: వ్యర్థాలను నిర్లక్ష్యం చేస్తే అది మానవాళికి ప్రమాదకరంగా మారుతుందని, వాటిని తిరిగి వినియోగించుకుంటూ మానవాళికి ఉపయోగకరంగా మార్చుకునే అంశంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన ''వ్యర్థాల నిర్వహణ–తిరిగి వినియోగం–పర్యావరణ పరిరక్షణ'' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సెమినార్‌కు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు వ్యర్థాలను తిరిగి వినియోగించుకోవడం అనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సెమినార్ ద్వారా జిల్లాలో ఉన్న పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, అంతర్జాతీయంగా జరుగుతున్న వినియోగ పద్ధతులను ఆకళింపు చేసుకోవడం వంటివి ఈ సెమినార్ ద్వారా సాధ్యపడుతుందన్నారు. అధ్యక్షత వహించిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ రెండురోజులపాటు నిర్వహిస్తున్న సెమినార్‌లో తొలిరోజు 35 మంది తమ పరిశోధన పత్రాలను చదివి వినిపిస్తారన్నారు. అనంతరం నివేదిక రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. రీసస్టైనబుల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ సీఈఓ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ నేడు ప్రతి రోజు ఒక్కో వ్యక్తి నుంచి 500 గ్రాములు మొదలు 600 గ్రాముల వరకు వ్యర్థాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తమ సంస్థ ద్వారా వ్యర్థాలను వందశాతం తిరిగి వినియోగించడం అనే విధానంలో వస్తువుల ఉత్పత్తి చేస్తున్నామని, ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ సెమినార్‌కు వచ్చామన్నారు. జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహక సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.గ్లోరీ స్వరూప మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. డెన్మార్క్ నుంచి వచ్చిన ప్రత్యేక అతిథి సారాపెట్రిసర్ హాన్సన్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పర్యావరణాన్ని మెరుగుపరుచుకోవడం, వస్తున్న వ్యర్థాలను తిరిగి వినియోగించే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించడం, ఆధునిక సాంకేతికతను శిక్షణ ద్వారా అందించడం వంటి కార్యక్రమాల ద్వారా సవాళ్లను అధిగమిస్తున్నామన్నారు. కొలంబో నుంచి వచ్చిన ప్రతినిధి శాంతాలింగం సాయనాథన్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నియంత్రణకు సంబంధించి తీసుకుంటున్న విధానాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యాప్తిని నియంత్రించడం, ఇందుకోసం జెనిటిక్ ఇంజినీరింగ్, రసాయనిక పదార్థాల రీసైక్లింగ్, నానో టెక్నాలజీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ వంటి అంశాలపై ఉదహరించారు. మలేషియా ప్రభుత్వ జాతీయ సర్క్యులర్ ఆర్థిక మండలి ప్రతినిధి డాక్టర్ ఉమేశ్వర మాట్లాడుతూ రోజుకు మలేషియాలో 36699 టన్నుల వ్యర్థాలు వస్తున్నాయన్నారు. వ్యర్థాల నిర్వహణ ద్వారా సంపదను సృష్టించుకోగలిగితే తలసరి ఆదాయంతోపాటు జాతీయ ఆదాయం, ఉద్యోగాల కల్పన మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు, ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ నటరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్సైల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికాగర్గ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు టూ టౌన్‌లో పనిచేస్తున్న వి.సాంబ శివయ్యను పొన్నలూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా యర్రగొండపాలెంలో పనిచేస్తున్న జీ.కోటయ్యను జిల్లా వీఆర్‌కు పిలిపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఎంవి.రాజేష్‌ను యర్రగొండపాలెం ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంటనే సంబంధిత డీఎస్పీలు ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించారు.

జనవాణి

పేదల దేవుడు జగన్!



నాకు తల్లిదండ్రులు, భర్త, పిల్లలు, బంధువులు ఎవరూ లేరు. బతకడానికి సెంటు భూమి కూడా లేదు. రోజు వారి కూలి పనుల పోవడానికి ఆరోగ్యం సహకరించడంలేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే బతుకుతున్నాను. ఒంట్లో బాగులేకపోయినా ఆస్పత్రికి పోవడానికి స్థోమత లేక ఇంట్లోనే ఉంటున్నాను. ఇలాంటి తరుణంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీరు ఇంటికి వచ్చి సచివాలయం దగ్గర హెల్త్ క్యాంప్ పెడుతున్నారని చెప్పారు. వెంటనే నాకు ఉన్న సమస్యలు చెప్పాను. సిబ్బంది వివరాలు నమోదు చేసుకొని టోకెన్ ఇచ్చారు. సచివాలయంలో నిర్వహించిన క్యాంప్‌లో డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చారు. ఇంటి వద్దకే పెద్ద డాక్టర్లు వచ్చి మాలాంటి పేద వారిని చూడటం గొప్పవిషయం. అందుకే జగన్ పేదల దేవుడు అయ్యాడు. మాలాంటి పేదల తరఫున జగన్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కొమ్మసాని కొండమ్మ, పొదిలి మండలం మల్లవరం పంచాయతీలోని కొస్టాలపల్లి

సొంతింటి కల నెరవేరింది



ఇళ్లు లేక అవస్థలు పడుతున్న నాలాంటి నిరుపేదలకు సొంతింటి కల సాకారమైంది. ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. ఇల్లు నిర్మాణంలో ఉంది. ఇప్పటి వరకు స్లాబ్ పూర్తి చేశాను. ఇంటి నిర్మాణం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి కంతుల వారిగా బిల్లులు మంజూరు చేస్తున్నారు. సొంతి ఇంటి కల నేరవేరడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబ సభ్యులు రుణపడి ఉంటాం.

– సొంటి సుభాషిణి, తోకపల్లి, పెద్దారవీడు మండలం

జగనన్న దయతో సొంత ఇల్లు వచ్చింది



నేను వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇప్పటి వరకూ సొంత ఇల్లు లేదు. ఈ పరిస్థితుల్లో ఇల్లు కావాలని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. వారు వచ్చి పరిశీలించి అర్హుడిని కావడంతో ఇల్లు మంజూరు చేశారు. ఉచితంగా ఇసుక, సిమెంటు, ఇనుము ఇచ్చారు. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. నాకల నెరవేరింది. జగనన్నకు ధన్యవాదాలు.

– కొలగట్ల సోమశేఖర్‌రెడ్డి, తర్లుపాడు

పై చదువులకు ఉపయోగపడుతుంది



జగనన్న సురక్ష క్యాంపులో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. వలంటీరు ఇంటికి వచ్చి అవసరమైన పత్రాలు తీసుకుని దరఖాస్తు పరిశీలించి వెంటనే ధ్రువ పత్రం మంజూరు చేశారు. నేను పదో తరగతి చదివా. గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు సులభంగా సర్టిఫికెట్లు పొందాం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– మేడికొండ సతీష్, ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, కాకుటూరివారిపాలెం

క్లుప్తంగా

అక్రమంగా డీజిల్ విక్రయం

- 1630 లీటర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు



జనావాసాల మధ్యలో విక్రయిస్తున్న డీజిల్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

ఒంగోలు సబర్బన్: సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామంలో అక్రమంగా జనావాసాల మధ్య డీజిల్ విక్రయిస్తున్న దుకాణాలపై ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బి.శ్రీ భవానీహర్ష ఆదేశాల మేరకు అధికారుల బృందం దాడులు చేసింది. గ్రామానికి చెందిన అదర శ్రీనివాసరెడ్డి, శ్రీమన్నారాయణకు చెందిన దుకాణాల్లో అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1,60,718 విలువైన 1630 లీటర్ల డీజిల్‌ను సీజ్ చేశారు. దాడుల్లో సీఐ రాఘవరావు, ఏఎఫ్ఐ ఆదిత్య, ఎస్సై నాగేశ్వరరావు, ఏఓ సంగమేశ్వరరావు, తహసీల్దార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

అద్దంకి రూరల్: విద్యార్థులు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. జాతీయ బాలల హక్కుల దినోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో బాలలకు కల్పించిన హక్కులను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. ప్రిన్సిపాల్ పి.దుర్గాగాయత్రి, ఏసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ.అరుణ కుమారి పాల్గొన్నారు.

విద్యుత్ అవసరాలకు రూ.170 కోట్లు ఖర్చు

- ప్రజల ఇబ్బందులు తీర్చటానికి ఒంగోలులో అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు
- కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లో రూ.27 కోట్లు వెచ్చించాం
- ఒంగోలులో రూ.6.50 కోట్లతో సెమీ ఇండోర్ సబ్ స్టేషన్
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



క్లాపేటలో 11 కేవీ సెమీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు రూ.170 కోట్లు ఖర్చు చేశామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో 33/11 సెమీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు బాలినేని గురువారం భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన బాలినేని స్థానిక ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. క్లా పేటకు చెందిన పలువురు స్థానిక కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి సమస్యలను బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. రైతు బజారు కోసం దారి సమస్యను ఎస్పీ మలికాగర్గ్‌తో మాట్లాడి పరిష్కరించాలని బాలినేనికి విజ్ఞప్తి చేశారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, క్లా పేట, రైల్వే స్టేషన్ రోడ్డు, కమ్మపాలెం, తూర్పు క్రిస్టియన్ పాలెంలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. కొత్తపట్నం బస్టాండ్ ఏరియా ఖరీదైన స్థలం కావటంతో ఎక్కడ ఏర్పాటు చేయాలని చూసినా స్థలం అందుబాటులో లేదన్నారు. చివరకు డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పోలీస్ శాఖకు చెందిన స్థలాన్ని తీసుకోవటానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. ఎస్పీ మలికాగర్గ్‌తో మాట్లాడటంతో పాటు డీజీపీ కార్యాలయం చుట్టూ పలు మార్లు తిరగాల్సి వచ్చిందన్నారు. ఇళ్ల మధ్యలో విద్యుత్ సబ్ స్టేషన్ అంటే చుట్టు పక్కల ఇళ్ల వాళ్లే అంగీకరించరని, అందులో పోలీస్ క్వార్టర్స్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ అంటే సవాలక్ష సమాధానాలు చెప్పాల్సి వచ్చిందని వివరించారు. ఇళ్ల మధ్యలో సబ్ స్టేషన్ కాబట్టి సెమీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించాల్సి వచ్చిందన్నారు. మామూలు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ అయితే రూ.2 కోట్లతో పూర్తయ్యేదన్నారు. సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ కోసం రూ.6.50 కోట్లు వెచ్చించి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ సబ్ స్టేషన్ ఒక భవనంలా ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఒంగోలు నగరంలో ఇది రెండో సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ అని వివరించారు. మొదటిది పాత గుంటూరు రోడ్డులో నిర్మించామని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో దశాబ్దాల తరబడి ఉన్న కర్నూలు రోడ్డు, అంజయ్య రోడ్డులోని హై టెన్షన్ విద్యుత్ లైనును తీసేసి అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేసుకోగలిగామన్నారు. రూ.63 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. తాను విద్యుత్ మంత్రిగా ఉండటంతో పూర్తి చేసుకోగలిగామని పేర్కొన్నారు. అదేవిధంగా ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.27 కోట్లు ఖర్చుచేశామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ మాట్లాడుతూ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో దృష్టి సారించామన్నారు. బాలినేని శ్రీనివాస రెడ్డి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తారన్నారు. ఆ సమస్య పరిష్కరించే వరకూ వెంటబడతారన్నారు. డీఎస్పీ కార్యాలయంలో సబ్ స్టేషన్ కోసం ఒకటిన్నర సంవత్సరంగా కృషి చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, ఏపీసీపీడీసీఎల్ మెంబర్ జిల్లెళ్ళమూడి రమాదేవి, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, ఒంగోలు విద్యుత్ ఈఈ శ్రీనివాసులు, కన్‌స్ట్రక్షన్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు డీఈఈ వినయ్ కుమార్ రెడ్డి, టూ టౌన్ సీఐ ఎస్ జగదీష్, విద్యుత్ శాఖ ఏఈఈలు శివ ప్రసాదరావు, మోహన్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమన్వయం డొల్లే..!

- మొక్కుబడిగా టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం
- నామమాత్రంగా అజెండాపై చర్చ
- జనార్దన్ భజనకే అధిక ప్రాధాన్యత
- సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు డుమ్మా



సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు టౌన్: టీడీపీ, జనసేన పార్టీల ఒంగోలు నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో నేతల మధ్య సమన్వయం లోపించినట్లు తెలుస్తోంది. పేరుకు రెండు పార్టీల సమావేశం అయినా టీడీపీ నేతలు ఆధిపత్యం చెలాయించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గురువారం ఉదయం పది గంటలకు నగరంలోని ఓ రెస్టారెంట్‌లో టీడీపీ, జనసేన పార్టీల నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం జరుగుతుందని ప్రకటించారు. జనసేన నాయకులు పది గంటలకే సమావేశానికి వచ్చారు. అయితే అక్కడికి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రెండు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు. దీంతో టీడీపీ శ్రేణులతోపాటు జనసేన నాయకులు సైతం అసహనానికి గురయ్యారు. ఇదిలా ఉండగా రెండు పార్టీల నేతలు ఈ సమావేశాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించలేదు. జనసేన నాయకులు నామమాత్రంగా హాజరయ్యారు. వారికి కేటాయించిన సీట్లలో టీడీపీ నేతలు కూర్చున్నారు. అంతేకాకుండా సమావేశంలో తెలుగుదేశం నాయకుల ప్రసంగాలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు. జనసేన నేతలకు అవకాశం ఇవ్వకపోవడంతో అసంతృప్తిగా కనిపించారు. ఈ సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలా కొనసాగిందని జనసేన కార్యకర్తలు విమర్శించడం కనిపించింది. ఇదిలా ఉండగా జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ కు ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న షేక్ రియాజ్‌కు మధ్య ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. సమావేశంలో ఆమె మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. చాలాసేపటి వరకు ఎదురు చూసిన ఆమె తనకు మైక్ ఇవ్వకపోవడాన్ని అవమానంగా ఫీలయ్యారు. ఇది గమనించిన దామచర్ల ఆమె మాట్లాడేందుకు మైకు ఇచ్చారు. సమావేశంలో మొత్తం 8 అంశాల మీద చర్చించాలని నిర్ణయించినప్పటికీ అజెండాలోని అంశాలను పక్కన పెట్టి కేవలం అధికార పార్టీని విమర్శించడానికే సమయం మొత్తం కేటాయించారు. అంతేగాకుండా ఇరుపార్టీల నేతలు ఎక్కువ సమయం దామచర్ల జనార్దన్ భజన చేయడం సరిపోయిందని సమావేశానికి హాజరైనవారు వ్యాఖ్యానించడం గమనార్హం. అత్యంత కీలకమని చెప్పుకొన్న ఈ సమన్వయ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని డుమ్మా కొట్టడం గురించి పలువురు టీడీపీ నాయకులు చర్చించుకోవడం కనిపించింది. మొత్తం మీద పొత్తు ప్రకటన తర్వాత నిర్వహించిన తొలి సమావేశం సాదాసీదాగా ముగిసింది.

బీసీలకు బ్యాక్ బోన్ వైఎస్సార్ సీపీ



మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రాజ్యలక్ష్మితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి జాలిరెడ్డి



రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి, కౌన్సిలర్లు

- చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రాజ్యలక్ష్మి ప్రమాణస్వీకారం
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

చీమకుర్తి: బీసీల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ బ్యాక్‌బోన్‌గా నిలిచిందని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం చీమకుర్తి గ్రేడ్-2 మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ పదవిని పద్మశాలీయులకు కేటాయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోపురపు రాజ్యలక్ష్మిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకాభిప్రాయంతో చైర్‌పర్సన్ ఎన్నిక

వైఎస్సార్ సీపీ అధిష్టానం సూచనలతో చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పార్టీ కౌన్సిలర్లతో చర్చించారు. బూచేపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో చర్చించిన అనంతరం ఏకాభిప్రాయంతో 6వ వార్డు కౌన్సిలర్ గోపురపు రాజ్యలక్ష్మిని చైర్‌పర్సన్‌గా నియమించాలని నిర్ణయించారు. తదనంతరం మున్సిపల్ కార్యాలయంలో రాజ్యలక్ష్మితో ఎన్నికల అధికారి బి.జాలిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన చైర్‌పర్సన్‌కు ఎన్నికల అధికారితోపాటు కమిషనర్ షేక్ ఫజులుల్లా శుభాకాంక్షలు తెలిపారు.

ఇప్పటి వరకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన చల్లా అంకులు, ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించిన బాపతు వెంకటరెడ్డిని ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులతోపాటు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, డాక్టర్ బి.జవహర్ పాల్గొన్నారు.

ఆక్రమించలేదు.. అండగా నిలిచా..

- మండువవారిపాలెంలో భూములు ఆక్రమించింది కమ్మ సామాజికవర్గీయులే..
- సర్వే నంబర్ 494లో 14 ఎకరాలు పేద బ్రాహ్మణుడు శ్రీనివాసరావుది
- న్యాయం చేయాలని స్నేహితుడైన నా భర్తకు స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ రాసిచ్చారు
- ఆ సర్వే నంబర్‌లో భూములపై కలెక్టర్, ఎస్పీ విచారణ చేపట్టాలి
- దళిత మహిళననే చులకనభావంతోనే టీడీపీ నేతలు, పచ్చ మీడియా నిందలు
- భూయజమానితో కలిసి ఆరోపణలను తిప్పికొట్టిన మేయర్ గంగాడ సుజాత



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, చిత్రంలో భూయజమాని శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: అద్దంకికి చెందిన పేద బ్రాహ్మణుడు మంచ శ్రీనివాసరావు భూములను మండువవారిపాలెం గ్రామానికి చెందిన కొందరు కమ్మ సామాజికవర్గీయులు ఆక్రమించుకున్నారని, ఆయనకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కోరారు. స్థానిక సంతపేటలోని మేయర్ నివాసంలో గురువారం మండువవారిపాలెంలోని భూముల యజమాని అద్దంకికి చెందిన మంచ శ్రీనివాసరావు, భర్త అరుల్‌రాజుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పచ్చ మీడియా, టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను మేయర్ తిప్పికొట్టారు. మేయర్ ఏమన్నారో ఆమె మాటల్లోనే.. 'ఒంగోలు మండలం త్రోవగుంట సమీపంలోని మండువవారిపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 494లో 14 ఎకరాల భూమి అద్దంకికి చెందిన పేద బ్రాహ్మణుడు మంచ శ్రీనివాసరావుది. ఆర్ఎస్ఆర్, ఇతర డాక్యుమెంట్లు వారి పూర్వీకుల పేరునే నమోదై ఉన్నాయి. అయితే మండువవారిపాలేనికి చెందిన కొందరు కమ్మ సామాజికవర్గీయులు ఆ భూమిని సాగు చేసుకుంటూ కనీసం కౌలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ×ఆ భూమిపై నీకు ఎలాంటి హక్కులు లేవ×ని శ్రీనివాసరావును బెదిరించడంతో తన స్నేహితుడైన నా భర్త అరుల్ రాజును కలిశారు. తాను ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగలేనని చెప్పి భూమి తనకే చెందేలా చూడాలని కోరారు. ఈ క్రమంలోనే నా భర్త పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్టర్ చేశారు. ఆ రిజిస్ట్రేషన్ ద్వారా తన భర్త ఎలాంటి లావాదేవీలు చేసేందుకు వీలుపడదు. ఆ భూమిపై తమకు ఎలాంటి హక్కులు లేవు. కేవలం మంచ శ్రీనివాసరావు తరపున చట్టబద్ధ హక్కు కోసం తన భర్త అర్జీ దాఖలు చేసే అవకాశం ఉంది' అని మేయర్ వివరించారు.

సర్వే నంబర్ 494లో 50.22 ఎకరాలు తమది అని చెబుతున్న వారి డాక్యుమెంట్లను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేయర్ డిమాండ్ చేశారు. ఎవరు హక్కుదారులో విచారణలో నిగ్గు తేల్చాలన్నారు. సమగ్ర విచారణ చేపట్టి వాస్తవ డాక్యుమెంట్లు కలిగిన వారికి న్యాయం చేయాలని కోరారు. తాను దళిత మహిళననే చులకన భావంతోనే టీడీపీ నాయకులు అభాండాలు మోపుతున్నారని, పచ్చ మీడియాలో అసత్య కథనాలు రాయిస్తూ బురద జల్లుతున్నారని మేయర్ ధ్వజమెత్తారు. తన భర్తకు ఎలాంటి హక్కులు లేని స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీని అవసరమైతే రద్దు చేసుకునేందుకూ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- టంగుటూరులో రవాణా శాఖ అధికారులు విస్తృత దాడులు
- వాహనదారులకు రూ.2 లక్షల జరిమానా

టంగుటూరు: వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు పేర్కొన్నారు. టంగుటూరు పరిసర ప్రాంతాలల్లో, టోల్‌ప్లాజా వద్ద గురువారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని, హెల్మెట్, సీటు బెల్టు ధరించని, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 60 వాహనాలకు ఈ చలానా ద్వారా రూ.2 లక్షల జరిమానా విధించారు. ఎంవీఐలు మాట్లాడుతూ.. వాహనదారులు రహదారి భద్రతా నియమాలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై ఖాదర్‌బాషాతో కలిసి పలువురు వాహదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు